సాక్షి
కాకినాడ

శనివారం । 1 । జూన్ । 2024



రూ.లక్ష విరాళం

ఇంద్రకీలాద్రి: విజయవాడ దుర్గమ్మ సన్నిధిలో నిత్యాన్నదానానికి ఎస్.గుల్షన్ కుటుంబీకులు (కాకినాడ వెంకట్ నగర్) శుక్రవారం రూ.లక్ష విరాళం సమర్పించారు.



వేటాడిన మృత్యువు

ఆలమూరు - మండపేట రోడ్డులో మోదుకూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో.. పొట్టకూటి కోసం చేపల వేటకు వెళ్తున్న ఇద్దరు మత్స్యకారులు దుర్మరణం పాలయ్యారు. - 8లో

గరిష్ఠం/కనిష్ఠం
42.0° / 29.8°

	గరిష్ఠం	కనిష్ఠం
రాజమహేంద్రవరం	42.0	29.0
కాకినాడ	38.5	29.8
అమలాపురం	41.0	29.0

న్యూస్‌రీల్

పింఛన్లకు ఈ నెలా కష్టాలే..

కాకినాడ సిటీ: అవ్వాతాతలు, ఇతర పింఛను దారులు జూన్ నెల పెన్షన్ పొందాలంటే మరోసారి బ్యాంకుల మెట్లు ఎక్కాల్సిందే. వలంటీర్ల ద్వారా పింఛన్ల పంపిణీని చంద్రబాబు అండ్ కో అడ్డుకోవడంతో పింఛను దారులు ఏప్రిల్ నుంచి ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. దాదాపు ఐదేళ్ల పాటు ఇంటి వద్దనే పింఛన్లు అందుకున్న లబ్ధిదారులు తొలిసారి గత ఏప్రిల్ నెలలో సచివాలయాల మెట్లు ఎక్కాల్సి వచ్చి, నానా ఇక్కట్లూ పడ్డారు. మే నెల పింఛన్ల పంపిణీలో 'పచ్చ' బ్యాచ్ మరో కుట్రకు తెర తీయడంతో అవ్వాతాతలు, దివ్యాంగులు చుక్కలు చూడాల్సి వచ్చింది. జూన్ నెల పింఛన్ల విషయంలోనూ అదే పరిస్థితి కొనసాగుతోంది. జిల్లాలో మొత్తం 2,79,805 మంది లబ్ధిదారులకు పింఛన్లుగా అందించేందుకు ప్రభుత్వం ఇప్పటికే రూ.82.09 కోట్లు విడుదల చేసింది. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు లబ్ధిదారుల్లో 2,08,444 మందికి (75 శాతం) సంబంధించిన బ్యాంకు ఖాతాల్లో రూ.62.53 కోట్లు జమ చేస్తారు. మిగిలిన 71,361 మందికి (25 శాతం) రూ.20.36 కోట్ల మొత్తాన్ని శనివారం ఉదయం నుంచి సచివాలయ ఉద్యోగులు ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేయనున్నారు.

డెల్టాలకు నేటి నుంచి నీటి విడుదల



తూర్పు డెల్టా కాలువ (ఫైల్)

ధవళేశ్వరం: సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు శనివారం నుంచి ఖరీఫ్ సాగుకు నీటిని విడుదల చేయనున్నారు. ఉదయం 10.30 గంటలకు ఖరీఫ్ సాగుకు నీరు విడుదల చేసేందుకు ఇరిగేషన్ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఖరీఫ్‌లో తూర్పు, పశ్చిమ, మధ్య డెల్టా కాలువల పరిధిలోని 10,13,161 ఎకరాలకు నీటిని విడుదల చేయనున్నారు. తూర్పు డెల్టాలో 2,81,303, మధ్య డెల్టాలో 2,01,896, పశ్చిమ డెల్టాలో 5,29,962 ఎకరాలకు సాగునీరు అందించనున్నారు. బ్యారేజీ వద్ద శుక్రవారం సాయంత్రం నీటిమట్టం 10.90 అడుగులుగా ఉంది. సముద్రంలోకి 3,195 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

ముగిసిన సప్లిమెంటరీ

బాలాజీ చెరువు (కాకినాడ సిటీ): పదో తరగతి, ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారంతో ముగిశాయి. చివరి రోజున పదో తరగతి సోషల్ పరీక్షకు 1,509 మంది హాజరు కాగా 1,197 మంది గైర్హాజరయ్యారు. ఇంటర్ ఒకేషనల్ బ్రిడ్జి కోర్సు ఫస్టియర్ పరీక్షకు 90 హాజరు కాగా 63 మంది పరీక్ష రాయలేదు. మధ్యాహ్నం నిర్వహించిన సెకండియర్ పరీక్షకు 72 మంది హాజరు కాగా 22 మంది గైర్హాజరయ్యారని జిల్లా ఇంటర్మీడియెట్ విద్యా అధికారి జీజీకే నూకరాజు తెలిపారు.

బోధనలో నాణ్యత పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ రమేష్

ప్రత్తిపాడు: విద్యా బోధనలో ప్రతి ఉపాధ్యాయుడూ నాణ్యతా ప్రమాణాలను పెంచాలని జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) పి.రమేష్ ఆదేశించారు. ప్రత్తిపాడు, జగ్గంపేట, ఏలేశ్వరం మండలాల ఉపాధ్యాయులకు ప్రత్తిపాడు లయన్స్ క్లబ్ కల్యాణ మండపంలో శుక్రవారం నిర్వహించిన ఓరియెంటేషన్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పాఠశాలలు తెరిచే జూన్ 12లోగా ఉపాధ్యాయులు గ్రామాల్లో ఇంటింటి సర్వే నిర్వహించి, బడి ఈడు పిల్లలను బడిలో చేర్పాలని సూచించారు. ప్రతి తరగతిలోనూ విద్యార్థుల సంఖ్య పెంచాలన్నారు. పరీక్షల్లో విద్యార్థుల మార్కులు బాగున్నప్పటికీ, వారిలో నాణ్యమైన విద్యా ప్రమాణాలు కనిపించడం లేదని అన్నారు. విద్యార్థులను ఉపాధ్యాయులు తమ పిల్లలుగా భావించి బోధించినప్పుడే నాణ్యమైన ప్రమాణాలు చూస్తామని చెప్పారు. విద్యా ప్రమాణాలు సాధించడం హెచ్‌ఎం ఒక్కరి వల్లనే సాధ్యం కాదని, ఉపాధ్యాయులందరూ సహకరించినప్పుడే సాధ్యమని చెప్పారు. బోధనలో అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నాడు - నేడు రెండో విడత బిల్లుల అప్‌లోడ్‌లో అశ్రద్ధ చేయరాదని డీఈఓ రమేష్ ఆదేశించారు. కార్యక్రమంలో ప్రత్తిపాడు, ఏలేశ్వరం, జగ్గంపేట ఎంఈఓలు వి.రాజబాబు, వై.అబ్బాయి, స్వామి, వై.అచ్చిరాజు, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కట్టుదిట్టంగా..

- జేఎన్‌టీయూకేలో కౌంటింగ్ కేంద్రాల వద్ద భారీ బందోబస్తు
- 4 ప్లటూన్ల సీఆర్‌పీఎఫ్ బలగాలు
- 1,500 మంది పోలీసులతో భద్రత
- డ్రోన్‌లతో డేగ కన్ను



కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ నివాస్

సాక్షి ప్రతినిధి, కాకినాడ: సార్వత్రిక సమరంలో విజేతలెవరో మరో నాలుగు రోజుల్లో స్పష్టం కానుంది. మే 13న జరిగిన పోలింగ్‌లో ప్రజలు ఇచ్చిన తీర్పు ఈవీఎంలలో నిక్షిప్తమై, కాకినాడ జేఎన్‌టీయూలోని స్ట్రాంగ్ రూముల్లో భద్రంగా ఉంది. నాడు ఓటర్లు ఇచ్చిన తీర్పు వెల్లడయ్యే సమయం దగ్గర పడుతోంది. ఈ తరుణంలో సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు జరిగే కాకినాడ జేఎన్‌టీయూలో మునుపెన్నడూ లేనివిధంగా కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. వర్సిటీ, పరిసర ప్రాంతాలను పోలీసులు ఇప్పటికే తమ ఆధీనంలోకి తీసుకుంటున్నారు. ఎన్నికల కమిషన్ (ఈసీ) ఆదేశాల మేరకు ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా పటిష్ట భద్రతా ఏర్పాట్లతో సిద్ధమవుతున్నారు.

పోలీసు వలయంలో..

- కౌంటింగ్ జరిగే కాకినాడ జేఎన్‌టీయూకు రెండు కిలోమీటర్ల పరిధిలోని ప్రాంతాలు ఇప్పటికే పోలీసు వలయంలోకి వెళ్లాయి. దీంతో పాటు జిల్లావ్యాప్తంగా 144 అమలు చేస్తున్నారు. తద్వారా ప్రజలు ఒకేచోట గుమిగూడి ఉండటాన్ని నిషేధించారు.
- పోలీస్ యాక్ట్ సెక్షన్ 30 అమలు చేస్తున్నారు. దీని ద్వారా పోలీసుల నుంచి ముందస్తు అనుమతి లేకుండా ర్యాలీలు, సభలు నిర్వహించడానికి వీలు లేకుండా చర్యలు తీసుకున్నారు.
- విజయోత్సవ ర్యాలీలు, బాణసంచా వినియోగంపై నిషేధం విధించారు.
- జేఎన్‌టీయూ, పరిసర ప్రాంతాలను 'నో ఫ్లయ్' జోన్‌గా ప్రకటించి, బయటి వ్యక్తులు డ్రోన్‌లు వినియోగించకుండా నిషేధం విధించారు.
- జేఎన్‌టీయూ, పరిసర ప్రాంతాలను డ్రోన్‌ల సాయంతో నిశితంగా పరిశీలించనున్నారు.
- సీసీ కెమెరాలతో నిరంతరం నిఘా పెట్టారు. దీనికోసం ఎస్పీ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ రూము ఏర్పాటు చేసి, అక్కడి నుంచి జిల్లాలో శాంతిభద్రతలను ప్రత్యేక పోలీసు అధికారి పర్యవేక్షించనున్నారు. జిల్లాలో ఎక్కడ ఏ చిన్న సమస్య ఉత్పన్నమైనా క్షణాల్లో కమాండ్ కంట్రోల్ రూముకు సమాచారం అందేలా ప్రత్యేక ఏర్పాటు చేశారు.
- ఓట్ల లెక్కింపు రోజున జిల్లాలో మొత్తం మద్యం షాపులు మూసివేయాలని ఆదేశించారు.
- సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక ప్రాంతాల్లో నిరంతర నిఘా కోసం అదనపు పోలీసు బలగాలతో పికెట్‌లు ఏర్పాటు చేస్తున్నారు.
- సున్నితమైన, అతి సున్నితమైన ప్రతి ప్రాంతంలోనూ అత్యవసర పరిస్థితుల్లో వినియోగించేందుకు ఇనుప ముళ్లకంచెలు సిద్ధం చేస్తున్నారు.
- ఎస్పీ ఎస్.సతీష్ కుమార్ పర్యవేక్షణలో జిల్లావ్యాప్తంగా ఏకకాలంలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహిస్తున్నారు. అనుమానిత ప్రాంతాల్లో విస్తృత దాడులు చేయడంతో పాటు, సరైన పత్రాలు లేకుండా, అనుమానాస్పదంగా ఉన్న వాహనాలను స్వాధీనం చేసుకుంటున్నారు. పలువురిపై కేసులు నమోదు చేస్తున్నారు.

ఆ రెండు నియోజకవర్గాలపై..

ప్రత్యేక పరిస్థితులు ఏర్పడవచ్చనే అనుమానంతో పోలీసులు రెండు నియోజకవర్గాలపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. పోలింగ్ సమయంలో చోటు చేసుకున్న పరిణామాలు, అక్కడి పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, కాకినాడ సిటీ, పిఠాపురం నియోజకవర్గాలను సున్నితమైనవిగా గుర్తించారు. ఈ రెండు నియోజకవర్గాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నారు. అలాగే, జిల్లావ్యాప్తంగా ప్రధాన పార్టీల అభ్యర్థులకు వ్యక్తిగత భద్రత కల్పించనున్నారు. దీంతోపాటు వారి ఇళ్ల వద్ద, ఆయా రాజకీయ పార్టీల కార్యాలయాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

బందో'మస్తు'



పోలీసుల కవాతు

- ఓట్ల లెక్కింపు జరిగే జేఎన్‌టీయూ వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. మొదటి అంచెలో ఈవీఎం ఓట్లు లెక్కించే ప్రాంతంలో 4 ప్లటూన్ల సీఆర్‌పీఎఫ్ బలగాలను మోహరిస్తున్నారు. ఒక్కో ప్లటూన్‌లో 25 నుంచి 30 మందికి తక్కువ కాకుండా సీఆర్‌పీఎఫ్ జవాన్లను నియమిస్తున్నారు.
- రెండో అంచెలో కౌంటింగ్ కేంద్రాల వద్ద ఆర్మ్‌డ్ ఫోర్స్‌ను (సాయుధ బలగాలు) నియమిస్తున్నారు.
- మూడో అంచెలో సివిల్ పోలీసుల సేవలను వినియోగించుకుంటున్నారు.
- జేఎన్‌టీయూ వద్దనే సుమారు 500 మంది పోలీసులతో ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు.
- మొత్తం నలుగురు అదనపు ఎస్పీలు, ఏడుగురు డీఎస్పీలు, 30 మంది సీఐలతో కలిపి సుమారు 1,400 మంది పోలీసులను బందోబస్తు కోసం నియమించారు.

ట్రాఫిక్ మళ్లింపు

జేఎన్‌టీయూకేకు వచ్చే మార్గాలన్నింటినీ పోలీసులు ఈ నెల 4న తమ ఆధీనంలోకి తీసుకోనున్నారు. కాకినాడ నగరంలోకి రాకపోకలను నియంత్రిస్తున్నారు. ఇటు భానుగుడి సెంటర్, అటు అచ్చంపేట జంక్షన్ల వద్ద రాకపోకలను నియంత్రించి, ప్రత్యామ్నాయ మార్గాలు ఏర్పాటు చేస్తున్నారు. పిఠాపురం వైపు నుంచి వచ్చే వాహనాలు లైట్ హౌస్, సూర్యారావుపేట, ఆర్టీసీ బస్ కాంప్లెక్స్ మీదుగా ప్రయాణించేలా రూట్ సిద్ధం చేశారు. ఇటు భానుగుడి సెంటర్ వద్ద ట్రాఫిక్‌ను నియంత్రించనున్నారు. కొండయ్యపాలెం ఫ్లై ఓవర్ మీదుగా వాహనాలను మళ్లించాలని నిర్ణయించారు.

హద్దు మీరితే జైలుకే..



ప్రజా తీర్పును గౌరవిస్తూ రాజకీయ నాయకులు, ప్రజలు శాంతియుతంగా ఉండాలి. దీనిపై విస్తృత అవగాహన కల్పించేందుకు జిల్లావ్యాప్తంగా రాజకీయ నేతలు, ప్రజలతో అఖిలపక్ష సమావేశాలు నిర్వహించాం. హద్దు మీరి శాంతిభద్రతల సమస్యకు కారకులైతే ఎంతటి వారినైనా ఉపేక్షించం. జైలుకు పంపడానికి సైతం వెనుకాడబోము. సున్నిత ప్రాంతాల్లో ప్రత్యేక పోలీసు బలగాలను మోహరిస్తున్నాం. ప్రజలందరూ ఎటువంటి ఆవేశకావేశాలకు లోను కాకుండా శాంతిభద్రతలకు సహకరించాలని ప్రచారం చేయించాం.

– ఎస్.సతీష్ కుమార్, జిల్లా ఎస్పీ, కాకినాడ

ఈసీ అనుమతి ఉంటేనే ప్రవేశం

కాకినాడ సిటీ: ఓట్ల లెక్కింపు భద్రతా ఏర్పాట్లపై ఎన్నికల కమిషన్ ఇప్పటికే మార్గదర్శకాలు విడుదల చేసింది. ఈసీ అనుమతి ఉన్నవారిని మాత్రమే కౌంటింగ్ కేంద్రంలోనికి అనుమతిస్తారు. కౌంటింగ్ సూపర్‌వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్లు, ఈసీ అనుమతి ఉన్న వ్యక్తులు, పరిశీలకులు, ఎన్నికల విధులు నిర్వర్తిస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు, అభ్యర్థులు, ఎన్నికల ఏజెంట్లు, కౌంటింగ్ ఏజెంట్లకు మాత్రమే అనుమతి ఉంటుంది. అభ్యర్థులైతేనే మంత్రులకు కౌంటింగ్ హాలులోనికి ప్రవేశం ఉంటుంది. మంత్రులు కౌంటింగ్ ఏజెంట్లుగా ఉండేందుకు అనుమతించరు. కౌంటింగ్ నిర్వహిస్తున్న సమయంలో ఎవరైనా ఏజెంట్ అనుచితంగా ప్రవర్తించినా, నిబంధనలు పాటించకపోయినా బయటకు పంపించే అధికారం రిటర్నింగ్ అధికారికి ఉంటుంది.

కౌంటింగ్ ఏర్పాట్లు ఇవీ..

- కౌంటింగ్ హాలుకు వంద మీటర్ల పరిధిలో మార్కింగ్ చేస్తారు. దీనిని పెడెస్ట్రియన్ (పాదచారుల) జోన్ అంటారు. దీని చుట్టూ బారికేడ్లు నిర్మిస్తారు. ఒక ప్రవేశ ద్వారం ఉంటుంది. ఇక్కడ స్థానిక పోలీసులను నియమిస్తారు. కౌంటింగ్ హాలుకు వంద మీటర్ల అవతలే వాహనాలను నిలిపివేస్తారు.
- కౌంటింగ్ హాలు ఆవరణలోకి వెళ్లే వారి గుర్తింపు పత్రాలను పోలీసులు పరిశీలిస్తారు. అధికారిక అనుమతి పత్రం, ఫొటో గుర్తింపు కార్డు లేకపోతే అభ్యర్థులు, ఎన్నికల ఏజెంట్లు, కౌంటింగ్ ఏజెంట్లు తదితరులెవ్వరినీ అనుమతించరు.
- ఎంట్రీ పాయింట్ వద్ద మెజిస్టీరియల్ అధికారాలు కలిగిన సీనియర్ రెవెన్యూ అధికారి ఉంటారు.
- స్ట్రాంగ్ రూము నుంచి కౌంటింగ్ హాలు దూరంగా ఉన్నప్పుడు ఈవీఎంలు తీసుకుని వెళ్లడానికి అసౌకర్యంగా ఉంటుంది. అందువలన స్ట్రాంగ్ రూము డోర్ వద్ద నుంచి కౌంటింగ్ హాలు వరకూ ప్రత్యేకంగా బారికేడ్లు ఏర్పాట్లు చేస్తారు.
- ఈవీఎంలు ఉంచిన స్ట్రాంగ్ రూము భవనాల ప్రవేశ ద్వారం నుంచి కౌంటింగ్ హాళ్ల వరకూ ఉన్న ప్రదేశాన్ని రెండో అంచెగా పరిగణిస్తారు. ఇక్కడ తగినంత మంది రాష్ట్ర సాయుధ పోలీసులు ఉంటారు.
- ఆడియో, వీడియో రికార్డు చేయగల మొబైల్ ఫోన్లు, ఐ ప్యాడ్లు, ల్యాప్‌టాప్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను లోపలకు అనుమతించరు.
- అలాగే, అగ్గిపెట్టె, ఇంకు పెన్నులు, బ్లేడ్‌లు, చాకులు, పిన్నులు, ఆయుధాలను కూడా అనుమతించరు. పెన్సిల్, తెల్ల కాగితాలు తీసుకుని వెళ్లవచ్చు.
- రెండో అంచెలో రాష్ట్ర పోలీసులు మాత్రమే తనిఖీలు చేస్తారు. మహిళలను కేవలం మహిళా పోలీసులు లేదా మహిళా హోంగార్డులు మాత్రమే తనిఖీ చేయాలి.
- కౌంటింగ్ ఏజెంట్లు, సిబ్బంది లోపలకు వెళ్లేందుకు ప్రత్యేక ప్రవేశం ఏర్పాటు చేస్తారు.
- కౌంటింగ్ హాలు బయట నిలబడి ఎవ్వరూ ఫోన్లలో మాట్లాడకూడదు. మీడియా లేదా పబ్లిక్ కమ్యూనికేషన్ రూములో మాత్రమే ఫోన్లలో మాట్లాడుకోవచ్చు. ఫోన్లు డిపాజిట్ చేసే సౌకర్యం ఉంటుంది. డిపాజిట్ చేసినప్పుడు టోకెన్లు జారీ చేస్తారు.
- కౌంటింగ్ కేంద్రం ద్వారం నుంచి మూడో అంచె భద్రత ప్రారంభమవుతుంది. ఇక్కడ సీఆర్‌పీఎఫ్ సిబ్బంది ఉంటారు. రిటర్నింగ్ అధికారి పిలిస్తే తప్ప వీరు కౌంటింగ్ హాలులోకి ప్రవేశించరాదు.
- కౌంటింగ్ హాలులోకి నిషేధిత వస్తువులు తీసుకుని వెళ్లకుండా ఇక్కడ కూడా తనిఖీలు చేస్తారు. కౌంటింగ్ హాలులో ఫొటోలు, వీడియోలు తీసేందుకు మీడియాకు అనుమతి ఉండదు.
- కౌంటింగ్ హాలు లోపలకు ఫోన్లు తీసుకుని వెళ్లడానికి ఎన్నికల పరిశీలకులకు మాత్రమే అనుమతి ఉంటుంది.
- ఏజెంట్లు తమకు కేటాయించిన టేబుల్ వద్ద మాత్రమే కూర్చోవాలి. కౌంటింగ్ హాలు అంతా తిరిగేందుకు వారికి అనుమతి ఉండదు.

వనదుర్గమ్మకు ఘనంగా చండీ హోమం

అన్నవరం: రత్నగిరి వనదేవత వనదుర్గ అమ్మవారికి శుక్రవారం ఘనంగా చండీ హోమం నిర్వహించారు. ఉదయం తొమ్మిది గంటలకు పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం చండీ హోమం ప్రారంభించారు. 11 గంటలకు ఘనంగా పూర్ణాహుతి నిర్వహించి, అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి, ప్రసాదాలు నివేదించి, భక్తులకు పంపిణీ చేశారు. వేద పండితులు ముష్టి పురుషోత్తం, అర్చకులు దత్తాత్రేయ శర్మ, కోట వంశీ, వ్రత పురోహితులు దేవులపల్లి ప్రకాష్, కూచుమంచి ప్రసాద్, పరిచారకులు ఫణి తదితరులు హోమం ఇతర పూజలు నిర్వహించారు. కాగా, ప్రధానాలయంలో సత్యదేవుని దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి అర్చకుడు ప్రయాగ రాంబాబు ఆధ్వర్యాన, రత్నగిరి తొలి పావంచా వద్ద కొలువైన కనకదుర్గ అమ్మవారికి అర్చకుడు కంచిభట్ల సాయిరామ్ ఆధ్వర్యాన కుంకుమ పూజలు ఘనంగా నిర్వహించారు. పూజల అనంతరం అమ్మవార్లకు ప్రసాదాలు నివేదించి, భక్తులకు పంపిణీ చేశారు.



చండీ హోమం పూర్ణాహుతి నిర్వహిస్తున్న పండితులు

ఏటీఎం కార్డు మార్చి.. సొమ్ము కాజేసి..

కొవ్వూరు: తన ఏటీఎం కార్డును మార్చేసి, తన అకౌంటులో ఉన్న రూ.1,15,000 సొమ్మును గుర్తు తెలియని వ్యక్తి కాజేశాడని పట్టణానికి చెందిన ఏఎల్ మధులత పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేశామని పట్టణ ఎస్సై ఎండీ జుబేర్ శుక్రవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మధులత ఈ నెల 30న పట్టణంలోని ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచి వద్ద ఉన్న ఏటీఎంలో నగదు డ్రా చేసేందుకు వెళ్లారు. ఆమెకు సహాయపడినట్లు నటించిన గుర్తు తెలియని ఆగంతకుడు.. ఆమె ఏటీఎం కార్డు తీసుకుని మరొకటి ఇచ్చాడు. ఏటీఎం నుంచి సొమ్ములు రావడం లేదని చెప్పి వెళ్లిపోయాడు. అనంతరం మధులత వద్ద తస్కరించిన కార్డుతో ఆమె అకౌంట్‌లోని సొమ్ము కాజేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దర్శకుడు సానా బుచ్చిబాబుకు పితృ వియోగం

అంత్యక్రియల్లో పాల్గొన్న ప్రముఖ దర్శకుడు సుకుమార్



బుచ్చిబాబును ఓదార్చుతున్న దర్శకుడు సుకుమార్

పిఠాపురం: ఉప్పెన సినిమాతో జాతీయ స్థాయి అవార్డు అందుకున్న సినీ దర్శకుడు సానా బుచ్చిబాబు తండ్రి పెదకాపు అనారోగ్యంతో గురువారం రాత్రి హైదరాబాద్‌లో మృతి చెందారు. స్వగ్రామమైన కాకినాడ జిల్లా యు.కొత్తపల్లిలో ఆయన అంత్యక్రియలు శుక్రవారం నిర్వహించారు. అంత్యక్రియల్లో ప్రముఖ దర్శకుడు సుకుమార్ పాల్గొని బుచ్చిబాబును ఓదార్చారు. ప్రస్తుతం రామ్‌చరణ్ హీరోగా పాన్ ఇండియా మూవీకి దర్శకత్వం వహిస్తున్న బుచ్చిబాబుకు పితృ వియోగం మానసికంగా ఇబ్బందికరమే అయినప్పటికీ.. తండ్రికి అంకితమిచ్చేలా సినిమా తీయాలని సుకుమార్ సూచించారు. ఉప్పెన సినిమాతో మంచి దర్శకుడిగా పేరు తెచ్చుకున్నా పెద్ద హీరోతో పెద్ద సినిమా తీసి, మరింత గుర్తింపు తెచ్చుకోవాలని తన తండ్రి ఎప్పుడూ చెబుతూ ప్రోత్సహించే వారని బుచ్చిబాబు గుర్తు చేసుకున్నారు. ఆయన కోరిక ప్రకారం ప్రస్తుతం పాన్ ఇండియా సినిమాకు దర్శకత్వం వహించే అవకాశం వచ్చిందని, కానీ, ఆ సినిమా చూసి ఆనందించేందుకు తన తండ్రి లేకపోవడం తనకు తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు.

టెన్త్‌లో సీబీఎస్‌ఈకి రైట్‌రైట్

- తొలి విడతగా రెండేళ్ల కిందట ప్రారంభం
- 33 ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి నుంచి అమలు
- 3,574 మందికి మేలు
- వీరందరికీ వచ్చే విద్యా సంవత్సరంలో సీబీఎస్ఈ విధానంలోనే 'పది' పరీక్షలు
- బోధనపై 430 మంది సబ్జెక్టు టీచర్లకు శిక్షణ

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): పేద విద్యార్థులకు ఉజ్వల భవితను అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం విద్యా సంస్కరణలు అమలు చేస్తోంది. ఒకవైపు పాఠశాలల్లో సమస్త సదుపాయాలూ కల్పిస్తూనే.. మరోవైపు జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో విద్యార్థులు పోటీ పడేలా విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకుని వచ్చింది. ఇందులో భాగంగా సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్‌ఈ) సిలబస్‌ను ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు సైతం అందిస్తోంది. ఈ సిలబస్‌తో పదో తరగతి, ఇంటర్మీడియెట్ పూర్తి చేస్తే.. జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ చూపి, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో సత్తా దాటే అవకాశం మన విద్యార్థులకు దక్కుతుంది. ఈ సిలబస్ రాష్ట్రంలో ఇప్పటి వరకూ కేంద్ర ప్రభుత్వ, కొన్ని ప్రైవేటు విద్యా సంస్థల్లో మాత్రమే అందుబాటులో ఉండగా.. ప్రభుత్వ పాఠశాలల్లో సైతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండేళ్లుగా అమలు చేస్తున్నారు.

ప్రభుత్వ నిర్ణయం భేష్



ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సీబీఎస్ఈ సిలబస్ అందుబాటులోకి తీసుకుని రావడం స్వాగతించదగిన అంశం. ప్రభుత్వ నిర్ణయం భేష్. జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో మన విద్యార్థులు ప్రతిభ చూపేందుకు అవకాశం ఉంటుంది.

– పిల్లి రమేష్, జిల్లా విద్యా శాఖాధికారి, కాకినాడ

రెండేళ్ల క్రితమే ప్రారంభం

తొలి దశలో జిల్లాలో కనీసం రెండెకరాలకు పైగా విస్తీర్ణం ఉన్న 33 పాఠశాలలను గుర్తించారు. వీటిల్లో జెడ్పీ హైస్కూళ్లతో పాటు కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు (కేజీబీవీ), ఆదర్శ పాఠశాలలు, సాంఘిక సంక్షేమ పాఠశాలలు కూడా ఉన్నాయి. ఈ పాఠశాలల్లోని 3,574 మంది విద్యార్థులకు రెండేళ్ల కిందటే 8వ తరగతి నుంచి సీబీఎస్ఈ సిలబస్ అందిస్తున్నారు. ఈ మొదటి బ్యాచ్ విద్యార్థులు ప్రస్తుతం పదో తరగతిలోకి వచ్చారు. వీరందరూ రానున్న విద్యా సంవత్సరంలో తొలిసారిగా పదో తరగతి పరీక్షలు సీబీఎస్ఈ సిలబస్‌తో రాయనున్నారు.

ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ

సీబీఎస్ఈ సిలబస్ అమలు చేస్తున్న పాఠశాలల్లో విద్యార్థులను సన్నద్ధం చేస్తోంది. దీంతో పాటు ఎప్పటికప్పుడు సీబీఎస్ఈ మార్చుతున్న సిలబస్‌పై 9, 10 తరగతులు బోధిస్తున్న 430 మంది ఉపాధ్యాయులకు ప్రభుత్వం ప్రత్యేక శిక్షణ ఇచ్చింది. ఇంగ్లిష్ 69, గణితం 67, ఫిజికల్ సైన్స్ 51, బయలాజికల్ సైన్స్ 50, సోషల్ స్టడీస్ 50, తెలుగు 52 మంది టీచర్లతో పాటు ఫిజికల్ ఎడ్యుకేషన్, సంస్కృతం తదితర సబ్జెక్టులు కలిపి మొత్తం 430 మంది సబ్జెక్టు ఉపాధ్యాయులకు రెండు బ్యాచ్‌లుగా ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో సీబీఎస్ఈ పదో తరగతి పాఠ్య పుస్తకాలు మారడంతో వాటిపై నిష్ణాతులైన శిక్షకులతో అవగాహన కలిగించారు.



సీబీఎస్ఈ సిలబస్ బోధనపై శిక్షణ పొందుతున్న అధ్యాపకులు

సీబీఎస్ఈతో ఇదీ మేలు

- సీబీఎస్ఈ సిలబస్ బోధిస్తున్న 33 స్కూళ్లలో 10వ తరగతి విద్యార్థులకు రానున్న విద్యా సంవత్సరం పబ్లిక్ పరీక్షలు సీబీఎస్ఈ విధానంలోనే జరుగుతాయి.
- బోధన అత్యాధునికంగా ఉంటుంది. ఆరో తరగతిలో చేరితే ఇంటర్మీడియెట్ వరకూ చదువుకోవచ్చు. విద్యాలయాల పర్యవేక్షణ సీబీఎస్ఈ పరిధిలో ఉంటుంది.
- జేఈఈ, నీట్ వంటి జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో మన విద్యార్థులు రాణించడానికి సీబీఎస్ఈ విద్యావిధానం ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది.
- విద్యార్థికి ఒత్తిడి లేకుండా, అభ్యసనా సామర్థ్యాలను పెంచేలా ఈ సిలబస్ ఉంటుంది. యాంత్రిక విద్యకు దూరంగా, వాస్తవానికి దగ్గరగా బోధన ఉంటుంది.
- పుస్తకాలను ఆసక్తికరంగా, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో రూపొందిస్తారు.
- ప్రతి తరగతికీ నిష్ణాతుడైన ఉపాధ్యాయుడు బోధిస్తాడు.
- కంప్యూటర్, సైన్స్ ల్యాబ్‌లు, ఆటస్థలం ఉండటం వీటి ప్రత్యేకత.
- పరీక్షల్లో ఉత్తీర్ణత శాతానికి పెద్దగా ప్రాధాన్యం ఉండదు. సబ్జెక్టు ఏ మేరకు నేర్చుకున్నారో పరీక్షించేలా ప్రశ్న పత్రాలు రూపొందిస్తారు. ఈ పరీక్షల్లో చాలా తక్కువ మంది మాత్రమే ఫెయిలవుతారు.
- ఐఐటీ, ఎయిమ్స్ వంటి కేంద్ర విద్యా సంస్థల్లో భవిష్యత్ అధ్యయనాలు కొనసాగించాలనుకుంటే సీబీఎస్ఈ పాఠ్యాంశాలు చాలా సహాయపడతాయి.

జిల్లా వ్యాప్తంగా టెన్త్‌లో సీబీఎస్ఈ బోధన అమలవుతున్న పాఠశాలలు, విద్యార్థుల వివరాలు

యాజమాన్యం	పాఠశాలల సంఖ్య	విద్యార్థులు
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు	13	1,747
మున్సిపల్ స్కూళ్లు	3	510
ఏపీ మోడల్ స్కూళ్లు	2	185
కేజీబీవీ	4	160
సాంఘిక సంక్షేమ పాఠశాలలు	9	695
రాష్ట్ర ప్రభుత్వ స్కూళ్లు	2	277

క్లుప్తంగా

హత్య కేసులో నిందితుడి అరెస్టు

తుని: యాచకుడిని హత్య చేసిన వ్యక్తిని గుర్తించి అరెస్టు చేశామని టౌన్ సీఐ ఎం.గీతా రామకృష్ణ శుక్రవారం తెలిపారు. వివరాల్లోకెళితే ఈ నెల 25న స్థానిక కొండవారిపేటకు వెళ్లే దారిలో రైల్వే ప్రహరీని ఆనుకొని యాచకుడు డేవిడ్‌రాజు(45) మృతి చెంది ఉన్నాడు. దీనిపై టౌన్ పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. శవాన్ని తుని ఏరియా ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచారు. శవాన్ని పరిశీలించిన జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్, పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి.. ఎస్సై రామలింగేశ్వరరావు ఆధ్వర్యంలో బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేయించారు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం వాడపల్లికి చెందిన యడ్ల అప్పారావు(చిన్ని)ను ముద్దాయిగా గుర్తించి అరెస్టు చేశారు. నిందితుడు అప్పారావుకి మృతుడైన డేవిడ్‌రాజుకు గత పదేళ్లుగా పరిచయం ఉంది. నిందితుడు యలమంచిలి, సామర్లకోట రైల్వే స్టేషన్ల మధ్య ట్రైన్లలో గుట్కాలు, సిగరెట్లు అమ్ముతూ అప్పుడప్పుడూ తుని రైల్వేట్రాక్ వద్ద నివాసముంటున్న డేవిడ్ రాజును కలిసేవాడు. ఈ క్రమంలో ఈ నెల 25న ఇద్దరూ కలిసి మద్యం సేవించారు. డబ్బుల విషయంలో ఇద్దరూ ఘర్షణ పడ్డారు. నిందితుడు అప్పారావు మృతుడు డేవిడ్‌రాజు తలను నేలపై బలంగా కొట్టడంతో మృతి చెందాడు.

ఐదుకు చేరిన మృతుల సంఖ్య


మాదాసి ప్రశాంత్‌కుమార్ (ఫైల్)

అమలాపురం రూరల్: భట్నవిల్లిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు చనిపోవడంతో మృతుల సంఖ్య ఐదుకు చేరింది. పోలీసుల కథనం ప్రకారం.. ఏప్రిల్ 28న అర్ధరాత్రి భట్నవిల్లి 216 జాతీయ రహదారిలో లారీ, ఆటో ఢీకొన్న ఘటనలో మామిడికుదురు, పి.గన్నవరం మండలాలకు చెందిన సాపే నవీన్, కొళ్లబత్తుల జతిన్, నల్లి నవీన్‌కుమార్, వల్లూరి అజయ్ మృతి చెందారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన మామిడికుదురు మండలం నగరం పితానివారిమెరక చెందిన మాదాని ప్రశాంత్‌కుమార్‌కు (16) కిమ్స్‌లో ఆపరేషన్ చేయడంతో 32 రోజులు వైద్యం పొందాడు. రెండు రోజుల కిందట ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయి ఇంటికి వెళ్లిన అనంతరం శుక్రవారం సాయంత్రం ప్రశాంత్‌కుమార్ మృతి చెందాడు. దీంతో మొత్తం మృతుల సంఖ్య ఐదుకు చేరింది. వైద్యం నిమిత్తం రూ.లక్షలు ఖర్చు చేసినా తమ కుమారుడి ప్రాణాలు దక్కలేదని తండ్రి శ్రీరాములు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రశాంత్‌కుమార్ ఇటీవల పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాడు.

సత్వర వైద్యానికి అంబులెన్స్

- 1962 టోల్ ఫ్రీ నంబర్‌తో పశువులకు అంబులెన్స్ ఏర్పాటు
- పాడిరైతు ఇంటి ముంగిటనే అందుతున్న పశువైద్య సేవలు

ఆలమూరు: పశువులకు సత్వర వైద్యం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తొలిసారిగా 1962 అంబులెన్స్ వ్యవస్థను తీసుకువచ్చింది. జనానికి 108, 104 మాదిరిగానే పశువులకు అనారోగ్యం, ఏదైనా రోడ్డు ప్రమాదం సంభవిస్తే సత్వరం స్పందించేలా 2022 మే 20న పశువైద్య సంచార సేవలను ప్రవేశపెట్టింది. పాడి పశువులు ఆపదలో ఉంటే సత్వరమే సంబంధిత యజమాని 1962 టోల్ ఫ్రీ నంబరుకు ఫోన్ చేస్తే అరగంటలో అంబులెన్స్ వచ్చి ఉచితంగా సేవలను అందిస్తుంది. వ్యాధి తీవ్రత తగ్గే వరకూ మందుల పంపిణీతో పాటు దిగువ స్థాయి సిబ్బంది పర్యవేక్షణలో ఉంచుతుంది. పాడిరైతులకు జీవనాధారమైన పశువులను రక్షిస్తూ వారికి ఎల్లప్పుడూ అండగా ఉంటుంది. 2019 పశు గణాంకాల ప్రకారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 2,97,938 మూగజీవాలు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 99 పశు వైద్యశాలలు ఉండగా 11 ఏడీఏ కార్యాలయాల సహకారంతో 453 ఆర్‌బీకేల ద్వారా పశువైద్యశాఖ సేవలు అందిస్తోంది. పశువుల సంరక్షణతో పాటు పెంపుడు కుక్కలకు ఏ విధమైన వ్యాధులు సోకకుండా టీకాలు వేస్తున్నారు. పాడి పరిశ్రమ, మూగజీవాల రక్షణ, కోళ్ల పెంపకం అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం ఐదేళ్ల నుంచి కృషి చేస్తోంది. మండపేటలోని ప్రాంతీయ పశువైద్య శిక్షణ కేంద్రంలో అధునాతనంగా ఏర్పాటు చేసిన థియేటర్‌లో పశువులకు మెరుగైన శస్త్ర చికిత్సలు జరుగుతున్నాయి.

నిరంతర వైద్య సేవలు

జిల్లాలో రూ.16.19 కోట్లతో కొనుగోలు చేసిన 14 సంచార వాహనాలను నియోజకవర్గానికి రెండు చొప్పున పశుసంవర్ధకశాఖ పాడిరైతులకు అందుబాటులో ఉంచింది. జిల్లాలో ప్రతి రోజూ సగటున 2,148 పశువులకు నిరంతరం వైద్య సేవలను అందిస్తోంది. జిల్లాలోవున్న పశువుల ఆస్పత్రుల్లో 81 రకాల మందులను అందుబాటులో ఉంచింది. జిల్లాలో గడచిన రెండేళ్ల కాలంలో పశువైద్యశాఖ ద్వారా రూ.2.35 కోట్ల మందులను ఉచితంగా అందజేసి సుమారు 60 వేల పశువులను, గొర్రెలను, మేకలను అనారోగ్యం నుంచి రక్షించి పాడిరైతులకు బాసటగా ప్రభుత్వం నిలిచింది.

ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా..

పశువులన్నింటికీ సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించాలన్న ప్రభుత్వ దృఢసంకల్పం ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోంది. ఇప్పటికే కేరళ, తమిళనాడు, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, కేరళ తదితర రాష్ట్రాల పశువైద్య బృందాలు జిల్లాతో పాటు ఇతర ప్రాంతాల్లో పర్యటించి పశుసంచార వైద్యసేవలపై అధ్యయనం చేశాయి. గతంలో పశువులకు అనారోగ్య సమస్యలు తలెత్తితే సుమారు ఐదు నుంచి పది కిలోమీటర్ల దూరంలో ఉన్న పశువుల ఆస్పత్రికి తీసుకువెళ్లి చికిత్సను అందించవలసి వచ్చేది.

సంచార పశువైద్యశాల (అంబులెన్స్) ప్రత్యేకతలు

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నెలకొల్పిన మొబైల్ అంబులేటరీ క్లినిక్స్ (సంచార పశువైద్యశాల)లో అనేక ప్రత్యేకతలు ఉన్నాయి. పశువులకు ఏవిధమైన అనారోగ్య సమస్యలు తలెత్తినా 1962 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేస్తే అరగంట వ్యవధిలో పశువుల మకాం వద్దకు అంబులెన్స్ చేరుకుంటుంది. అందులో పశువైద్యాధికారి, సాంకేతిక సహాయ సిబ్బంది, డ్రైవర్ కమ్ అటెండర్ ఉంటారు. ఆ అంబులెన్స్‌లో మైక్రోస్కోప్‌తో పరీక్షలు చేసే విధంగా 51 ప్రత్యేక పరికరాలు ఉంటాయి. వాటితో ప్రథమ చికిత్సను అందించడంతో పాటు కృత్రిమ గర్భాధారణ తదితర ప్రాథమిక పరీక్షలు నిర్వహిస్తారు. 20 పరికరాలతో రోగ నిర్ధారణ, 15 పరికరాలతో రక్త పరీక్షలు చేసి సత్వరమే ఫలితాలను తెలియజేస్తారు. అంబులెన్స్‌లో సుమారు రూ.30 వేలు విలువ చేసే 81 రకాల మందులు అందుబాటులో ఉంటాయి. దీనివల్ల ఉచితంగా చికిత్సను అందించడంతో పాటు మందులను కూడా పశువైద్యశాఖ సమకూర్చుతుంది. అనారోగ్యం తీవ్రత ఉన్న పశువులను సమీప పశువుల ఆస్పత్రులకు తరలించేందుకు వీలుగా అంబులెన్స్‌లో లిఫ్ట్ సౌకర్యాన్ని కల్పించారు. నిమిషాల వ్యవధిలో పశువైద్యశాలకు తరలించి నాణ్యమైన చికిత్సను అందించిన అనంతరం ఆ అంబులెన్స్ మళ్లీ పశువుల మకాం వద్దకు తీసుకువస్తుంది. దీంతో పశువులను తరలించేందుకు అయ్యే వ్యయ,ప్రయాసలు తప్పుతున్నాయని రైతులు చెబుతున్నారు.


పినపళ్లలో సంచార పశువైద్యశాల ద్వారా పాడి పశువులకు సేవలందిస్తున్న వెటర్నరీ ఉద్యోగులు

జిల్లాలో ఇలా..

వరుస సంఖ్య	పశువుల వివరాలు	సంఖ్య
1.	ఆవులు	75,839
2.	గేదెలు	1,60,403
3.	మేకలు	26,801,
4.	గొర్రెలు	28,475
5.	పందులు	6,120


పశువైద్య సేవలు అందించే అంబులెన్స్

సమగ్రంగా సేవలు



ప్రభుత్వ ఆదేశాలకనుగుణంగా రైతుల సహకారంతోపాడి పరిశ్రమ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నాం. పశు వైద్యశాల అంబులెన్స్‌లో సత్వరమే సేవలను అందించి ఉచితంగా మందులను పంపిణీ చేస్తున్నాం.

– ఎల్.అనిత, ఏడీఏ, ఆలమూరు

ప్రభుత్వ తోడ్పాటు బాగుంది



పశువులకు వైద్యపరంగా ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటు మాలాంటి రైతులకు వరంగా మారింది. గతంలో సుదూర ప్రాంతాలకు పశువులను తీసుకువెళ్లి వైద్యం చేయించాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ ప్రయాస తప్పింది.

– తోలేటి అమ్మిరాజు, పాడిరైతు, నందిపూడి.

వేటాడిన మృత్యువు

- చేపల వేటకు వెళుతూ ఇద్దరు మత్స్యకారుల మృతి
- మూడు వాహనాలు ఢీ–ముగ్గురికి తీవ్ర గాయాలు
- ఆలమూరు అగ్నికుల క్షత్రియులపేటలో తీవ్ర విషాదం


లంకే సూరిబాబు (ఫైల్) వనమాడి సాయిబాబు (ఫైల్)

ఆలమూరు: పొట్టకూటి కోసం చేపలవేటకు వెళుతున్న మత్స్యకారులు విగతజీవులుగా మారారు. ట్రాక్టర్ రూపంలో ఇద్దరినీ మృత్యువు కబళించింది. మరో ముగ్గురిని తీవ్ర గాయాలు పాలు చేసింది. చేపల వేటకు బయలుదేరిన పావుగంటలోనే తమ వారు మృత్యువాత పడ్డారనే దుర్వార్త విన్న ఆలమూరులోని అగ్నికుల క్షత్రియులపేట వాసులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.

ఆలమూరు–మండపేట రోడ్డులోని మోదుకూరు పరిధిలో శుక్రవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆలమూరుకు చెందిన ఐదుగురు మత్స్యకారుల బృందం బొలెరో వాహనంలో వలలు తీసుకుని ఉదయాన్నే రాజానగరం మండలంలోని తుంగపాడులో చేపల వేట సాగించేందుకు బయలుదేరారు. స్థానిక ఉషాలక్ష్మి రైసుమిల్లు సమీపంలోని వరహాల (కొత్త) కాలువ రేవు వద్దకు వచ్చేసరికి మండపేట నుంచి రేషన్ బియ్యం లోడుతో వస్తున్న ట్రాక్టర్ వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో వాహనం వెనుక భాగంలో నిల్చుని ఉన్న వనమాడి సాయిబాబు (62), లంకే సూరిబాబు (49) అక్కడికక్కడే ట్రక్కులోనే మృతి చెందారు. అందులో ప్రయాణిస్తున్న కొప్పాడి రమణ, దొక్కాడి శ్రీనివాను, వనమాడి మావుళ్ల స్వామికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుల్లో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మావుళ్లస్వామి ఆలమూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ట్రాక్టర్, బొలెరో వాహనాల డ్రైవర్లు ఇద్దరూ ప్రమాదాన్ని ముందే పసిగట్టి కిందకు దూకేయడంతో క్షేమంగా బయట పడ్డారు. రోడ్డు ప్రమాదం సంభవించిందన్న సమాచారం తెలుసుకున్న ఎస్సై ఎల్.శ్రీనునాయక్ తమ సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ప్రమాదానికి గురైన వాహనాలను పక్కకు తప్పించి అప్పటికే నిలిచిపోయిన ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. పోస్టుమార్టం కోసం మృతదేహాలను మండపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మోదుకూరు వీఆర్వో సుజాత ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేశారు. రావులపాలెం సీఐ ఎం.రామ్‌కుమార్ దర్యాప్తు చేస్తున్నారు.

పార్క్ చేసిన లారీ డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే..

కాలువ రేవు వద్ద నీటితో శుభ్రపరచేందుకు లారీని పార్క్ చేశారు. శుభ్రపరిచిన అనంతరం ఆ లారీని తీసుకెళ్లే క్రమంలో వెనుకా ముందు వస్తున్న వాహనాలను గమనించకుండా వెనుక గేర్ వేసి నడపడంతో ఈ ప్రమాదం సంభవించింది. మండపేట వైపు నుంచి ధాన్యం లోడుతో వస్తున్న ట్రాక్టర్ ఈ లారీని తప్పించే క్రమంలో మత్స్యకారులు ప్రయాణిస్తున్న బొలెరో వాహనాన్ని ఢీకొంది. ఇదే సమయంలో చింతలూరుకు చెందిన ఒక యువకుడు తన ద్విచక్ర వాహనంతో వేగంగా వచ్చి ప్రమాదానికి గురైన ఆ రెండు వాహనాలను ఢీకొట్టి పరారయ్యాడు. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనం తీవ్రంగా దెబ్బతినగా ఆ యువకుడికి స్వల్ప గాయాలు అయినట్లు తెలుస్తోంది.


సాయిబాబు, సూరిబాబు మృతదేహాలు


మోదుకూరులో ఢీకొన్న మూడు వాహనాలు

తీవ్ర విషాదంలో అగ్నికుల క్షత్రియపేట

ఆలమూరులోని అగ్నికుల క్షత్రియపేటకు చెందిన ఇద్దరు మృత్యువాత పడటంతో అక్కడ విషాదఛాయలు అలుముకున్నాయి. గతంలోను ఇలాంటి ఘటనలు జరిగాయి. ఈ నేపథ్యంలో గంగపుత్రులకు ఇలాంటి కష్టాలు ఎందుకు ఎదురవుతున్నాయంటూ తీవ్ర మనోవేదనకు గురయ్యారు. సూరిబాబు, సాయిబాబు కుటుంబ సభ్యులు తాము పెద్దదిక్కును కోల్పోయామంటూ విలపిస్తున్న తీరు చూపరులకు కంటతడి పెట్టించింది. చేపల వేటకు వెళ్లి తిరిగి వస్తారని ఎదురుచూస్తున్న వారు.. ఇంటి దైవాలు ఇక లేరనే వార్తను జీర్ణించుకోలేకపోతున్నారు. తమకు ఇక దిక్కెవరూ అంటూ మృతదేహాల వద్ద కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న తీరు స్థానికులను కలచివేసింది.

ప్రమాదవశాత్తూ బావిలో పడి వ్యక్తి మృతి


సాయిబాబు మృతదేహం

మామిడికుదురు: బహిర్భూమికి వెళ్లి మోట బావిలో నీళ్లు తోడుకుంటూ ప్రమాదవశాత్తూ దానిలో పడి ఒక వ్యక్తి మృతి చెందిన ఘటన పెదపట్నంలంక గ్రామంలో జరిగింది. నగరం ఎస్సై పి.సురేష్ కథనం ప్రకారం పెదపట్నంలంకకు చెందిన వడ్రంగి మేస్త్రి యేడిద సాయిబాబు (48) గురువారం రాత్రి వడ్రంగి పని ముగించుకుని ఆలస్యంగా ఇంటికి వచ్చాడు. ఇంటికి వచ్చిన తరువాత బహిర్భూమికి బయటకు వెళ్లాడు. అతను ఎంత సేపటికి తిరిగి ఇంటికి రాకపోవడంతో భార్య దుర్గాభవానికి అనుమానం వచ్చి స్థానికుల సహాయంతో గాలించగా మోట బావిలో పడి కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్నాడు. దీంతో ఆమె బిగ్గరంగా కేకలు వేయడంతో స్థానికులు వచ్చి నూతిలో దిగి సాయిబాబును బయటకు తీసుకువచ్చారు. బయటకు వచ్చిన తరువాత సీపీఆర్ చేయగా కొద్దిసేపు ప్రాణంతో ఉన్నాడు. 108 అంబులెన్స్‌కు ఫోన్ చేయగా సిబ్బంది వచ్చి సాయిబాబును పరీక్షించి అప్పటికే అతను మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి భార్య దుర్గాభవాని ఫిర్యాదుపై కేసు నమోదు చేశామని ఎస్సై సురేష్ తెలిపారు. మృతుడు సాయిబాబు నిరుపేద కుటుంబానికి చెందిన వాడు. రెక్కాడితే కాని డొక్కాడని పరిస్థితి వారి కుటుంబానిది. సాయిబాబు మృతితో ఉన్న దిక్కు కోల్పోయామని భార్య, అతని ఇద్దరు కుమార్తెలు తనుశ్రీ, కావ్యశ్రీ కన్నీరు మున్నీరుగా విలపించారు.

రైలు నుంచి జారిపడి అసోం వాసి..

తుని: తుని జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో రైలు నుంచి జారిపడి అసోం రాష్ట్రానికి చెందిన రాజు రాయ్(39) మృతి చెందాడని హెడ్ కానిస్టేబుల్ మోహనరావు తెలిపారు. శుక్రవారం అందిన సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అన్నవరం–దుర్గాడ గేటు మధ్యలో గుర్తు తెలియని రైలు నుంచి జారిపడి రాజు రాయ్ తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని 108 అంబులెన్స్‌లో కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ 3 గంటల సమయంలో మృతి చెందినట్టు ఆన్ డ్యూటీ డాక్టర్ తెలిపారు. జీఆర్పీ ఎస్సై ఎస్‌కే అబ్దుల్ మారూఫ్ ఆదేశాల మేరకు దర్యాప్తు చేయగా మృతుడు అసోం రాష్ట్రానికి చెందిన రాజు రాయ్‌గా గుర్తించామన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారని, అదే ప్రాంతానికి చెందిన శంకర్ తపతో కలిసి రాష్ట్రంలోని అమరావతిలో కూలీ పని కోసం రైలులో వస్తుండగా ప్రమాదవశాత్తూ జారిపడి మృతి చెందాడన్నారు. మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించామని మోహనరావు తెలిపారు.

మరొక బంగారం కొరియర్ అరెస్ట్

ఈసారి పట్టుబడిన వ్యక్తి పెద్దాపురం వాసి

చిట్టినగర్ (విజయవాడ పశ్చిమ): ఎటువంటి బిల్లులు లేకుండా లక్షలాది రూపాయల విలువైన బంగారు వస్తువులను రవాణా చేస్తున్న యువకుడిని విజయవాడ కొత్తపేట పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. నిందితుడి వద్ద నుంచి 405 గ్రాముల బంగారు వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చెన్నై నుంచి బంగారాన్ని అక్రమంగా రవాణా చేస్తున్నట్లు కొత్తపేట పోలీసులకు సమాచారం అందింది. దీంతో రైల్వే స్టేషన్ వెస్ట్ బుకింగ్ వద్ద నిఘా పెట్టారు. కాకినాడ జిల్లా పెద్దాపురానికి చెందిన గుడిసి శ్రీనివాసరావు(41) బంగారమ్మ జ్యూయలరీ షాపు నడుపుతుంటాడు. ఈ నెల 29వ తేదీన రూ.29.50 లక్షల నగదును తీసుకుని చెన్నైకి వెళ్లి 382 గ్రాముల బంగారు వస్తువులు, 23 గ్రాముల చైను కొనుగోలు చేశాడు. బంగారం తీసుకుని విజయవాడ ట్రైన్‌లో వచ్చిన శ్రీనివాసరావు కాకినాడకు బస్సులో వెళ్లే క్రమంలో స్టేషన్ బయటకు రాగా పోలీసులు అనుమానంతో ఆరా తీయడంతో విషయం బయటపడింది. దీంతో శ్రీనివాసరావును స్టేషన్‌కు తరలించి సరైన బిల్లులు లేకపోవడంతో నిందితుడిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

కొత్తపేటకు బంగారు వ్యాపారుల క్యూ : కొత్తపేట పోలీసులు వరుసగా రెండు రోజుల పాటు బంగారాన్ని అక్రమంగా రవాణా చేస్తున్న యువకులపై నిఘా పెట్టి అరెస్టు చేస్తుండటం ఈ ప్రాంతంలో సంచలనం సృష్టించింది. శుక్రవారం ఉదయం నుంచి నగరానికి చెందిన పలువురు బంగారు వ్యాపారులతో పాటు మంగళగిరికి చెందిన వ్యాపారులు సైతం స్టేషన్ బయట చక్కర్లు కొడుతున్నారు. బంగారం అక్రమంగా రవాణా చేస్తున్న యువకులపై పోలీసులకు ముందస్తుగా సమాచారం ఇవ్వడంతో ఈ డొంక కదులుతున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల కోడ్ నిరంతరం నిఘా ఉంటున్న ఈ తరుణంలోనే... భారీగా బంగారం దొరకడంతో ఇక సాధారణ రోజుల్లో ఏ స్థాయిలో అక్రమ రవాణా జరుగుతుందోనని నగర వాసులు ఆశ్చర్యానికి గురవుతున్నారు.

నేటి నుంచి ఓపెన్ స్కూల్ సప్లిమెంటరీ పరీక్షలు

- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 21 పరీక్షా కేంద్రాలు
- హాజరు కానున్న 5,740 మంది విద్యార్థులు

రాయవరం: ఇప్పటికే పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలు పూర్తి కాగా, నేటి నుంచి ఏపీ సార్వత్రిక విద్యాపీఠం సప్లిమెంటరీ పరీక్షలు శనివారం నుంచి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రారంభం కానున్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో పదవ తరగతికి 293 మంది, ఇంటర్‌కు 1,428 మంది పరీక్షలకు హాజరు కానున్నారు. తూర్పుగోదావరి జిల్లాలో పదవ తరగతికి మూడు, ఇంటర్‌కు ఐదు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. పదవ తరగతి పరీక్షలకు 546, ఇంటర్ పరీక్షలకు 1,136 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. కాకినాడ జిల్లాలో పదవ తరగతికి మూడు, ఇంటర్‌కు నాలుగు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. కాకినాడ జిల్లాలో పదవ తరగతి పరీక్షలకు 842, ఇంటర్‌కు 1,495 మంది హాజరు కానున్నారు. ఏపీ సార్వత్రిక విద్యా పీఠం ద్వారా నిర్వహించనున్న పదవ తరగతి, ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇప్పటికే విద్యార్థులకు హాల్ టికెట్లు జారీ చేయగా, గుర్తించిన పరీక్షా కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కూడా ప్రాధాన్యమిస్తున్నట్టు ఏపీ ఓపెన్ స్కూల్ జిల్లా కన్వీనర్ పి.సాయివెంకటరమణ తెలిపారు. ఏపీ ఓపెన్ స్కూల్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన నియామకాలను చేపట్టారు.

పరీక్షల టైమ్ టేబుల్

తేదీ	10వ తరగతి	ఇంటర్
జూన్1	తెలుగు, ఉర్దూ, కన్నడ, ఒడియా, తమిళం	హిందీ, తెలుగు, ఉర్దూ
జూన్3	హిందీ	జీవశాస్త్రం, వాణిజ్య/ వ్యాపార శాస్త్రం,గృహ విజ్ఞాన శాస్త్రం
జూన్5	ఇంగ్లిష్	ఇంగ్లిష్
జూన్6	గణితం, భారతీయ సంస్కృతి,వారసత్వం	గణితం, చరిత్ర, వ్యాపార గణిత శాస్త్రం
జూన్7	శాస్త్ర,సాంకేతిక విజ్ఞానం, గృహ విజ్ఞానశాస్త్రం	ఫిజిక్స్, సివిక్స్, మనో విజ్ఞాన శాస్త్రం
జూన్8	సాంఘిక శాస్త్రం, ఆర్థిక శాస్త్రం	కెమిస్ట్రీ, ఎకానమిక్స్, సామాజిక శాస్త్రం

పరీక్షలు ప్రతి రోజు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు నిర్వహించనున్నారు. ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు జూన్ 10 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించనున్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న బైక్

- ముగ్గురు యువకులకు తీవ్ర గాయాలు
- నిడదవోలు మండలం సమిశ్రగూడెంలో ఘటన


సమిశ్రగూడెం శివారులో జరిగిన ప్రమాదంలో తీవ్ర గాయాలతో యువకులు

నిడదవోలు రూరల్: మండలంలోని సమిశ్రగూడెం శివారులో బైక్ అదుపుతప్పి ఆర్టీసీ బస్సును ఢీకొన్న ఘటనలో ముగ్గురు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాల ప్రకారం.. కొవ్వూరు మండలం వాడపల్లికి చెందిన కొండా ప్రవీణ్, గెల్లా దిలీప్, సిర్రా నిరీక్షణ్ అనే యువకులు సింగవరం గ్రామంలో జరుగుతున్న ముత్యాలమ్మ జాతరకు వచ్చి శుక్రవారం సాయంత్రం బైక్‌పై ఇంటికి వెళుతున్నారు. బైక్‌పై వేగంగా వెళుతున్న ముగ్గురు యువకులు సమిశ్రగూడెం శివారులో అదుపు తప్పి పడిపోతూ అదే సమయంలో తాడేపల్లిగూడెం వైపు వెళుతున్న ఆర్టీసీ బస్సుని ఢీకొట్టారు. దీంతో గెల్లా దిలీప్ తలకు తీవ్ర గాయాలు కాగా, ప్రవీణ్, నిరీక్షణ్‌లకు శరీరంలోని వివిధ భాగాల్లో తీవ్ర గాయాలు కావడంతో 108 వాహనంలో నిడదవోలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించినట్టు పోలీసులు తెలిపారు. ఘటనా స్థలాన్ని ఎస్సై రమేష్ పరిశీలించి ప్రమాద వివరాలు నమోదు చేసుకున్నారు.